ప్రజాశక్తి
శనివారం 1 జూన్ 2024
5
అల్లూరి సీతారామరాజు

ప్రభుత్వ భూముల ఆక్రమణపై వివరాలు సేకరించండి

ప్రజాశక్తి-చింతపల్లి: ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారి వివరాలు సేకరించాలని తహసీల్దార్ రామకృష్ణ ఆదేశించారు. తహశీల్దార్ కార్యాలయంలో మండలంలోని అన్ని పంచాయితీల వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ భూములు, ఆక్రమణలు స్వాధీనంపై వీఆర్వోలకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ముందుగా ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారికి ఫారం 7 ద్వారా నోటీస్ అందించి, అనంతరం ఫారం 5 ద్వారా ఆక్రమణలను తొలగిస్తామన్నారు.

మాట్లాడుతున్న తహశీల్దార్ రామకృష్ణ

కౌంటింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ విజయ సునీత

ప్రజాశక్తి-పాడేరు: కౌంటింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేసి సజావుగా జరిగే విధంగా అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం. విజయ సునీత ఆదేశించారు. శుక్రవారం స్థానిక డిగ్రీ కళాశాలలో ఈవీఎంల భద్రపరిచిన స్ట్రాంగ్ రూములను సందర్శించారు. అరకు అసెంబ్లీ నియోజకవర్గం, పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం, అరకు పార్లమెంట్ నియోజకవర్గం లోని సేగ్మెంట్లకు సంబంధించిన స్ట్రాంగ్ రూములను పరిశీలించారు. భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అదేవిధంగా నాలుగు కౌంటింగ్ హాల్స్ పరిశీలించి పలు సూచనలు చేశారు. సీసీ కెమెరాలను, సిసి కెమెరాల రికార్డింగ్‌ను పరిశీలించారు. ప్రధాన రహదారిలో అదనపు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, కౌంటింగ్ కేంద్రాల చుట్టూ అధిక లైటింగ్ ప్రసరించే విధంగా ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.నిరంతర విద్యుత్ సరఫరా ఉండాలని, ప్రత్యామ్నాయంగా జనరేటర్లు కూడా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోటీలో ఉన్న అభ్యర్థుల సౌకర్యార్థం కమ్యూనికేషన్ కేంద్రం ఏర్పాటు చేయాలని సూచించారు. కౌంటింగ్ కేంద్రం వద్ద రెండు అత్యవసర వైద్య శిభిరాలు ఏర్పాటు చేయాలని, అగ్నిమాపక శకటం, అగ్ని ప్రమాద నివారణ పరికరాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారి బి.పద్మావతి, స్పెషల్ డిప్యూటీ అంబేద్కర్, పాడేరు తహాసిల్దార్ కళ్యాణ్ చక్రవర్తి, గిరిజన సంక్షేమ శాఖ ఇఇ డివిఆర్ఎం రాజు, డిఇఇ అనుదీప్, డిపిఒ కొండల రావు, జిల్లా అగ్నిమాపక అధికారి ఇపిడిసిఎల్ అధికారులు, డిపిఆర్ఓ పి. గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయసునీత

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి : పిఒ

అరకులోయ : పకడ్బందీగా ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు చేసామని అరకు అసెంబ్లీ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి, ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ స్పష్టం చేసారు. శుక్ర వారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అరకు అసెంబ్లీ నియోజవకర్గంలో శాసనసభ అభ్యర్థులతో సార్వత్రిక ఎన్నికల ఓట్లు లెక్కింపు ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు ప్రత్యేకంగా టేబుళ్లు, ఇవిఎంలు లెక్కింపునకు 14 టేబుళ్లు ఏర్పాటు చేసామని చెప్పారు. ప్రతీ రౌండులో మూడు ఇవిఎంలను ర్యాండమ్‌గా రెండు ఇవియంలను చెక్ చేస్తారని చెప్పారు. ఇటిపిబిఎస్ ఓట్లు 53 పోస్టులో వస్తున్నాయని చెప్పారు. వాటిని పక్కాగా స్కాన్ చేసి లెక్కిస్తామన్నారు. ఆ డేటాలను కంప్యూటరీక రిస్తామన్నారు. ప్రతీ రౌండులో వచ్చిన ఓట్లను లెక్కించి ఎప్పటికప్పుడు మీడియా సెంటర్‌కు సమాచారం అందిస్తామని తెలిపారు. ఐదు వివి పాట్‌లను ఎంపిక చేసి క్రాస్ లెక్కింపు చేస్తామన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు కంట్రోల్ యూనిట్ లో నమోదైన ఓట్లు లెక్కింపు చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశంలో తహశీల్దారులు సుధాకర్, సోమేశ్వరరావు, వివిద పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న పిఒ అభిషేక్

లోయలోకి దూసుకెళ్లిన ద్విచక్ర వాహనం

తండ్రీ కొడుకు దుర్మరణం
భార్య, కుమార్తెకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-కొయ్యూరు

కొయ్యూరు మండలం చింతవానిపాలెం ఘాట్ రోడ్డులో శుక్రవారం ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ద్విచక్ర వాహనం బ్రేక్‌లు ఫెయిలై 100 అడుగుల లోయలోకి దూసుకెళ్లడంతో తండ్రీ కొడుకులు దుర్మరణం చెందగా, భార్య, కుమార్తె తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... అడ్డతీగల మండలం సీతారాం గ్రామానికి చెందిన వెలమ రాంబాబు, భార్య కాసులమ్మ, కుమారుడు ప్రశాంత్, కుమార్తెతో కలిసి కొయ్యూరు మండలం బాలరేవుల గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చారు. శుక్రవారం ఉదయం నలుగురు తమ ద్విచక్ర వాహనంపై తిరిగి పయనమయ్యారు. చింతవానిపాలెం ఘాట్ రోడ్డులో వారి బైక్ బ్రేకులు ఫెయిల్ కావడంతో బైక్ లోయలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో రాంబాబు, అతడి కుమారుడు ప్రశాంత్ అక్కడికక్కడే మృతి చెందారు. భార్య కాసులమ్మ, కుమార్తె తీవ్రంగా గాయపడ్డారు. ఇది గమనించిన స్థానికులు క్షతగాత్రులను నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమాచారం పోలీసులకు అందజేశారు. కొయ్యూరు సిఐ వెంకటరమణ, ఎస్ఐ రామకృష్ణ తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు. ఈ విషయమై కొయ్యూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు. బైకుపై నలుగురు ప్రయాణించడం వల్లే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు అంటున్నారు. గతంలో ఈ మలుపు వద్ద పలు ప్రమాదాలు కూడా సంభవించాయని చెబుతున్నారు.

సంఘటనా స్థలంలో తండ్రీ కొడుకు రాంబాబు, ప్రశాంత్ మృతదేహాలు

కొండదొర తెగను...

ప్రభుత్వ వెబ్‌సైట్‌లో పునరుద్ధరించాలి

- రెవెన్యూ శాఖ కుల ధ్రువీకరణ పత్రం విభాగానికి సిపిఎం లేఖ - కుల ధ్రువీకరణపత్రాలు జారీ చేయాలని అభ్యర్థన

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లాలో ఎస్టీ కొండ దొర తెగను ప్రభుత్వ పోర్టల్ వెబ్సైట్లో వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనరస రెవిన్యూ శాఖ కుల ధ్రువీకరణ పత్రం విభాగానికి శుక్రవారం లేఖ పంపించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఎస్టీ కొండ దొర తెగకు చెందిన అర్హులందరికీ తక్షణమే ఎస్టి కుల ధృవీకరణ పత్రాలు జారీ మొదలు పెట్టాలని రెవిన్యూ శాఖ అధికారులను అభ్యర్థించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో జీవిస్తున్న కొండ దొర తెగను ఆదివాసీ ఏజెన్సీ ట్రాక్ ఎస్టీగా గుర్తిస్తూ భారతరాష్ట్రపతి షెడ్యూల్ తెగల గెజిట్ నోటిఫికేషన్‌ను 1950లో జారీ చేశారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎస్టీ కొండదొర తెగను సీరియల్ నెంబర్ 13లో పొందు పరిచారని చెప్పారు. ఆదివాసీ తెగ పేరును తప్పుగా ఉచ్ఛరించకూడదన్నారు. 1950కి ముందు ఎస్టీ హెరీ దా గుర్తించబడిన వారిని తెగ ధృవీకరణపత్రం జారీకి జాప్యం చేయకూడదని, ఒక వేళ ఇటువంటి ఘటనలు జరిగితే ఇది ఉద్దేశ్యపూర్వకంగా చేసినట్లు భావించి నేరంగా పరిగణిస్తూ రాష్ట్రపతి జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో పేర్కొన్న విషయం తెలిసిందే నన్నారు. తరుచుగా ఆదివాసీ తెగల కుల ధ్రువీకరణ పత్రాలు జారీ విషయంలో రెవెన్యూ శాఖ అధికారులు ఏపి ప్రభుత్వ పోర్టల్ వెబ్ సైట్లో సాంకేతిక సమస్యల పేరుతో తెగ ధృవీకరణ పత్రం జారీలో జాప్యం జరుగుతోందని చెప్పారు. 2022 సంవత్సరం లో ఎస్టీ భగత, కమ్మర, మాలి, వాల్మీకి తెగల ధృవీకరణపత్రం జారీలో జాప్యంతో వందలాది మంది ఆదివాసీ తెగల విద్యార్థులు కాలేజీ, స్కూల్‌లో అడ్మిషన్ కోల్పోయారన్నారు. చేయూత పథకంలో ఆర్థిక సాయం పొందలేకపోయారన్నారు. అర్హత ఉండి కూడా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ఆదివాసీలు పొందలేకపోతున్నారని తెలిపారు. ఈ విషయమై ఆదివాసీ గిరిజన సంఘంపెద్ద ఎత్తున నిరసన చేపడుతుందని చెప్పారు. ఆదివాసీ కొండదొర తెగకు చెందిన విద్యార్థులు కాలేజ్, స్కూల్ అడ్మిషన్ కోసం కుల ధృవీకరణ పత్రం జారీ చేయాలని ఏపి ప్రభుత్వ పోర్టల్ వెబ్ సైట్ (మీ సేవ) లో ఆన్ లైన్ దరఖాస్తు చేసుకున్నారని, ఏపి ప్రభుత్వ పోర్టల్ లో ఎస్టీ కొండదొరతెగ మాత్రం కనిపించలేదన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఆదివాసీ కొండదొర తెగ కు చెందిన ఆదివాసీలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. తక్షణమే ఆదివాసీ కొండదొర తెగ ను ప్రభుత్వ పోర్టల్ వెబ్ సైట్ లో పునరుద్ధరించాలని కోరారు. వెబ్ సైట్ నిర్వాహకులపై ఎస్సి, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తెగ ధృవీకరణ పత్రాలు జారీలో జాప్యం జరిగిన, నష్టపోయిన విద్యార్థులకు కాలేజ్, స్కూల్ అడ్మిషన్‌లో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఆదివాసీ తెగల మధ్య విభజనకు పాల్పడుతున్న ప్రభుత్వ వైఖరిని వెంటనే మార్చు కోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై లేఖ ప్రతులను ముఖ్య కార్యదర్శి (గిరిజన సంక్షేమ శాఖ. సచివాలయం) జిల్లా కలెక్టర్, ఐ.టి డి. ఏ ప్రాజెక్ట్ అధికారి, సబ్ కలెక్టర్, పాడేరు రెవెన్యూ డివిజన్ అధికారులకు పంపించామన్నారు.

అవార్డు అందుకుంటున్న తపాలా ఇన్‌స్పెక్టర్ అబ్దుల్

తపాలా ఇన్‌స్పెక్టర్‌కు రాష్ట్ర స్థాయి అవార్డు

ప్రథమ స్థానంలో చింతూరు సబ్ డివిజన్

ప్రజాశక్తి-చింతూరు

చింతూరు తపాలా ఇన్‌స్పెక్టర్ అబ్దుల్‌కు రాష్ట్ర స్థాయి అవార్డు లభించింది. తపాలా శాఖ ద్వారా చేపట్టిన నూతన ఖాతాల సేకరణలో ఆంధ్ర ప్రదేశ్ తపాలా సర్కిల్ స్థాయిలో చింతూరు సబ్ డివిజన్ ప్రథమ స్థానంలో నిలిచింది. మొత్తం 120 సబ్ డివిజన్‌లు ఉండగా చింతూరు సబ్ డివిజన్‌లో అధికంగా పొదుపు ఖాతాలను సేకరించడం జరిగింది. ఈ మేరకు గురువారం విశాఖపట్నంలో ఛీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ ఏ.ప్రకాష్ చేతుల మీదుగా అవార్డుల ప్రదానం చేశారు. చింతూరు సబ్ డివిజన్లో పనిచేస్తున్న తపాలా ఉద్యోగుల సహకారం వలనే ఈ పురస్కారాన్ని పొందగలిగామని చెప్పారు.

అప్పలకొండకు ఉత్తమ బిపిఎం అవార్డు

రాజవొమ్మంగి : మండలంలోని తంటికొండ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్‌గా పనిచేస్తున్న ఎం.అప్పలకొండ శుక్రవారం ఉత్తమ బిపిఎం పురస్కారం అందుకున్నారు. ఆమె బ్రాంచ్ పరిధిలో గ్రామస్తులకు ఎక్కువగా పోస్టల్ ఖాతాలు ప్రారంభించడంతో పాటు, వారికి ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించినందుకుగాను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ మేరకు శుక్రవారం విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో చీఫ్ పోస్టుమాస్టర్ ప్రకాష్ చేతులమీదుగా ఆమె ఈ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను పోస్టల్ సిబ్బంది అభినందించారు.

'గిడ్డి ఈశ్వరి గెలుపు ఖాయం'

ప్రజాశక్తి-చింతపల్లి: నిత్యం ప్రజా సంక్షేమం కోసం పని చేసిన పాడేరు నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ శాసన సభ్యురాలు గిడ్డి ఈశ్వరి సార్వత్రిక ఎన్నికలలో మరో మారు శాసన సభ్యురాలుగా గెలుపొందడం ఖాయమని తెలుగుదేశం పార్టీ చింతపల్లి మండలం ఎస్సీ సెల్ మాజీ చైర్మన్ కుందూరు రాజు జోస్యం చెప్పారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, అదే క్రమంలో రాష్ట్రంలోనూ తెలుగుదేశం అధికారంలోకి వస్తుందని, తెదేపా జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరోసారి ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టడం ఖాయమన్నారు. గడచిన ఐదేళ్లుగా వైసిపి ప్రభుత్వ నిరంకుశ, నియంతృత్వ విధానాలతో విసుగెత్తిన ప్రజలు ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు కంకణం కట్టుకున్నారన్నారు.

ర్యాలీ చేపడుతున్న వైద్యులు, సిబ్బంది

పొగాకు అనర్థాలపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి- పాడేరు: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో శుక్రవారం జిల్లా డిఐఓ డాక్టర్ సిహెచ్ సాధన ఆధ్వర్యంలో వరల్డ్ నో టొబాకో డే సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ బి. హేమలత ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరై గవర్నమెంట్ జెనరల్ హాస్పిటల్ ప్రాంగణంలో ఉదయం 9 గంటలకు సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. అనంతరం పాత బస్టాండ్ వద్ద మనవహారం నిర్వహించి పెద్ద ఎత్తున వైద్య ఆరోగ్య సిబ్బంది నినాదాలు చేశారు. మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్, కమ్యూనిటి మెడిసిన్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ యెర్రయ్య, సైకియాట్రి విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ టిఎస్ ఎన్ రాజు మాట్లాడుతూ, పొగాకు వాడటంతో కలిగే దుష్ప్రభావాలను వివరించారు. పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలన్నారు. జిల్లాలో పొగాకు ఉత్పత్తుల వాడకాన్ని గణనీయంగా తగ్గించడానికి వైద్య ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని, దీనికోసం ప్రత్యేక డ్రైవులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, మెడికల్ కాలేజీ సిబ్బంది, డ్రగ్ అడిక్షన్ సెంటర్ స్టాఫ్, పాడేరు గవర్నమెంట్ నర్సింగ్ కాలేజ్ స్టూడెంట్స్, మినుములూరు పీహెచ్సీ సిబ్బంది, ఆశా వర్కర్స్ , కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణ జయంతి వేడుకలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: సూపర్ స్టార్ కృష్ణ, మహేష్ బాబు ఫ్యాన్ గా ఉండటమే ఒక అదష్టమని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. విశాఖ సిటీ కృష్ణ, మహేష్ బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కళా ప్రపూర్ణ, పద్మ భూషణ్, సూపర్ స్టార్ కృష్ణ జయంతి వేడుకలు సరస్వతి పార్కు జంక్షన్ వద్ద వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా అభిమానులు భారీ కేక్ కట్ చేసి అనంతరం అన్న సంతర్పణ చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే గణేష్ కుమార్ మాట్లాడుతూ కృష్ణ అభిమానుల కోరిక మేరకు విశాఖలో రెండు చోట్ల సూపర్ స్టార్ కృష్ణ కాంస్య విగ్రహం ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో ఎన్నికల కోడ్ అడ్డొచ్చిందన్నారు. మరోసారి తాను ఎమ్మెల్యేగా, రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ రుణం తీర్చుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నిప్పుల కొలిమి

అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్న జనం

జన సంచారం లేక నిర్మానుష్యంగా ఉన్న రాజవొమ్మంగి ప్రధాన రహదారి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మునిపెన్నడూ లేని విధంగా భానుడు భగభగ మండిపోతుండడంతో ఏజెన్సీ ప్రాంతం సైతం నిప్పులు కొలిమిలా ఉంది. ఉష్ణతాపానికి ఉక్కపోత తోడు కావడంతో గిరిజనం అల్లాడిపోతున్నారు. ఏజెన్సీలో సాధారణంగా 40 డిగ్రీలు ఉష్ణోగ్రత అధికం అనుకుంటే.., ఇప్పుడు అది కాస్త 43 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు బయటకు రావడానికి బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం 7 గంటల నుండి ప్రారంభమవుతున్న సూర్య ప్రతాపం సాయంత్రం ఐదు గంటల వరకు కొనసాగుతుంది. తప్పనిసరి పరిస్థితుల్లో రహదారిపై ప్రయాణించే క్రమంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వృక్షాల వద్ద కొంత సేపు సేదతీరుతూ ప్రయాణాలు సాగిస్తున్నారు. ఎదైనా అవసరం ఉండి బయటకు రావాలంటే తలపై వస్త్రాలు, గొడుగు లేనిదే రావడానికి సాహసించడం లేదు. అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోతతో అల్లాడుతుండగా, వేళాపాళాలేని విద్యుత్ కోతలతో జనం నానా అవస్థలు పడుతున్నారు. ఎండలు మండుతున్న నేపథ్యంలో ఏజెన్సీ రహదారులు నిర్మానుష్యంగా మారాయి. శీతల పానీయాలకు, కొబ్బరిబొండాలకు గిరాకీ పెరిగింది.

కొయ్యూరు : కొయ్యూరుతో పాటు పరిసర ప్రాంతాల్లో శుక్రవారం 40 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో మండల కేంద్రంలో రోడ్డుమీద జనసంచారం కనిపించలేదు. ఉదయం 11 గంటలకే దుకాణాలను మూసివేశారు. సాయంత్రం నాలుగు గంటల తర్వాతే బయటకొచ్చారు. గత రెండు మూడు రోజుల నుంచి మన్యంలో విపరీతమైన వేడి గాల్పులతో ప్రజలు అల్లాడిపోతున్నారు.

కొయ్యూరులో కురుస్తున్న వర్షం

ఉరుములతో కూడిన వర్షం

ప్రజాశక్తి-కొయ్యూరు

కొయ్యూరు మండలంలో శుక్రవారం సాయంత్రం ఐదు గంటల నుండి వాతావరణం ఒక్కసారిగా చల్లబడి ఉరుములతో కూడిన వర్షం కురిసింది. దీంతో ఎండవేడితో అల్లాడిపోతున్న మండల వాసులు ఉపశమనం పొందారు. ఎండ, ఉక్కపోతతో తీవ్రంగా ఇబ్బంది పడిన ప్రజలు ఒక్కసారిగా వర్షం పడి చల్ల పడడంతో ఊపిరి పీల్చుకున్నారు.

పిడుగుపాటుకు యువకుడు మృతి

కొయ్యూరు : మండలంలోని బూదరాళ్ళ పంచాయతీ, గొర్రెలమెట్ట గ్రామంలో శుక్రవారం పిడుగు పడి ఆ గ్రామానికి చెందిన సీదరి దేవరాజు మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.... గొర్రెలమెట్ట గ్రామానికి చెందిన దేవరాజు శుక్రవారం మధ్యాహ్నం పశువుల కాపుకు వెళ్లాడు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ఉరుములుతో కూడిన వర్షం కురిసింది. ఈ సమయంలో దేవరాజు పశువులు కాస్తున్న ప్రాంతంలో పిడుగు పడి ఆయన అక్కడికక్కడే మతిచెందారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడు దేవరాజు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.



దేవరాజు మృతదేహం

మలేరియాను రూపుమాపడానికి చర్యలు

ప్రజాశక్తి -సీలేరు

అల్లూరి జిల్లాలో మలేరియా అదుపులో ఉందని, పూర్తిస్థాయిలో మలేరియాని రూపుమాపడానికి అన్ని చర్యలు చేపడుతున్నామని జిల్లా మలేరియా అధికారి పీవీఎస్.ప్రసాద్ అన్నారు. జీకే వీధి మండలంలో శుక్రవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. సప్పర్ల, దారకొండ, సీలేరు ప్రభుత్వ ఆసుపత్రులను ఆకస్మిత తనిఖీలు నిర్వహించి రికార్డులను పరిశీలించారు. మలేరియా కేసులు నమోదు, మలేరియా కిట్లు నిల్వలు తదితర అంశాలపై ఆయా పీహెచ్‌సిల వైద్య అధికారులతో చర్చించారు. అనంతరం సీలేరు పీహెచ్సీ పరిధి చింతపల్లి క్యాంపు గ్రామానికి వెళ్లి నిల్వ ఉన్న నీటిలో వృద్ధి చెందిన లార్వాను సేకరించి గ్రామస్తులతో సమావేశమయ్యారు. దోమలు ఎలా వృద్ధి చెందుతాయనే అంశాలను ప్రజలకు అవగాహన కల్పించారు. దోమల వల్ల కలిగే అనర్థాల గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా నివారణకు మొదటి విడతగా ఏసియం స్ప్రేయింగ్ 1767 గ్రామాల్లో చేశామని, మరో 300 గ్రామాల్లో స్ప్రేయింగ్ చేసేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. రెండో విడతలో ఏసియం స్ప్రేయింగ్ జూలై 15 నుంచి ఆగస్టు 30 లోగా పూర్తి చేయడానికి అన్ని చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. జిల్లా పరిధిలో అన్ని పీహెచ్సీల్లో మలేరియా కిట్లు కొడతలేదన్నారు. మారుమూల గ్రామాల్లో ఎవరికి జ్వరం వచ్చినా వైద్య పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ చేయాలని తమ సిబ్బందికి ఆదేశించడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీలేరు పిహెచ్సి వైద్యాధికారి సౌమ్య, అసిస్టెంట్ మలేరియా అధికారి ఏ.సత్యనారాయణ, మలేరియా సబ్ యూనిట్ అధికారి ఆర్.కన్నబాబు, హెల్త్ సూపర్వైజర్ ఎన్.త్రినాధ, హెచ్‌వి బాలమణి, హెల్త్ అసిస్టెంట్ ఏ.సత్యనారాయణ, ఆరోగ్య కార్యకర్తలు బి.దేవి, కెవిఎన్. కుమారి, ఆశా కార్యకర్తలు వసంత, కరుణామణి, దోయమతి, సంగీత, మంగ, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల వద్ద డ్రమ్‌ల్లో నీటి నిల్వలను పరిశీలిస్తున్న మలేరియా అధికారి ప్రసాద్

ఉపాధి హామీ కూలీలకు రోజు వేతనం పెంచాలి

ప్రజాశక్తి - కొత్తకోట: ఉపాధి హామీ కూలీలకు రోజు వేతనం పెంచాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె. గోవిందరావు డిమాండ్ చేశారు. ఆరు రోజుల పనికి ఆరు రోజులు కూలి ఇవ్వలేదని, ఆరు రోజులు పని చేస్తే 4 రోజులు మాత్రమే కూలి ఇస్తున్నారని విమర్శించారు. రావికమతం మండలం టి.అర్జాపురం శివారు దోలవానిపాలెం గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో శుక్రవారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ, రావికమతం మండలంలో 12 పంచాయితీల్లో 41 గ్రామాల్లో 670 మంది ఉపాధి పథకం పై జాబ్ కార్డులు కలిగి ఉన్నారని పేర్కొన్నారు. వీరికి అటవీ హక్కుల పట్టాలు 2011లో 180 మందికి పట్టాలు ఇవ్వగా, 2022 లో మరో 500 మందికి ఆర్ఓఎఫ్ ఆర్ పట్టాలిచ్చారన్నారు. జాబ్ కలిగిన ప్రతి ఒక్కరికి 150 పని దినాలు కల్పించాలని చట్టం చెబుతున్నా నాన్ షెడ్యూల్ ప్రాంతంలో ఈ చట్టం అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్య పై ఉపాధి హామీ పథకం అధికారులకు ఫిర్యాదు చేయగా ఎటువంటి స్పందన లేదని గోవిందరావు మండి పడ్డారు. టి.అర్జాపురం శివారు కొత్తపల్లి పంచాయితీ పరిధిలో ఐదు గిరిజన గ్రామాల్లో నేటికీ ఇటువంటి పరిస్థితి కొనసాగుతోందన్నారు. నిత్యావసర ధరలు రోజు రోజుకి పెరిగిపోతున్నా కూలి రేట్లు మాత్రం రోజు రోజుకి దిగ జారి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కూలి గిట్టు బాటు కాక ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఉపాధి హామీ పథకం ఆరు రోజుల పనికి ఆరు రోజులు కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రాజెక్ట్ అధికారులు ఆదివాసి ఉపాధి కూలీల సమస్యలు పరిష్కారం చేయాలని, లేకుంటే జూన్ 10న రావికమతం ఎంపీడీవో కార్యాలయం వద్ద భారీ ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు సింగరాపు వలసయ్య తదితరులు పాల్గొన్నారు...

పింఛనుదారులకు ఇబ్బంది కలగనీయొద్దు

ప్రజాశక్తి - నక్కపల్లి: పింఛను లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పింఛన్ నగదు పంపిణీ ఏర్పాటు చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ఈఓపిఆర్డి సత్యనారాయణ, ఏవో సీతారామరాజు లతో కలిసి పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. జూన్ 1వ తేదీన పింఛన్ తీసుకునేందుకు బ్యాంకుల వద్దకు వచ్చే లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని బ్యాంకుల వద్ద టెంట్లు ఏర్పాటు చేయాలని, తాగు నీటిని అందుబాటులో ఉంచాలని సూచించారు. నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులకు, వికలాంగులకు సచివాలయ ఉద్యోగులు సకాలంలో పింఛన్ నగదు అందజేయాలన్నారు. సచివాలయ సిబ్బంది ప్రతిరోజు యూనిఫాం ధరించాలని, కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలన్నారు.ఈ సర్వీసెస్ అమౌంట్ వెంటనే జమ చేయాలని సూచించారు.

మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం

ప్రజాశక్తి - నక్కపల్లి:మెనూ ప్రకారం విద్యార్థులకు సుచి, రుచికరమైన భోజనం అందించాలని ఎంఈఓ కె నరేష్, మధ్యాహ్న భోజన పథకం జిల్లా కోఆర్డినేటర్ కె.విజయలక్ష్మి సూచించారు. మండలంలోని వేంపాడు హైస్కూల్లో శుక్రవారం మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. నూతన విద్యా సంవత్సరంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థులకు పోషకాహారం అందించాలన్నారు. మెనూ అమలు చేయడంలో ఎటువంటి పొరపాటు జరగకుండా చూడాలన్నారు. పరిశుభ్రమైన వాతావరణంలో, పరిశుభ్రంగా భోజనం తయారు చేసి వడ్డించాలని విద్యార్థులకు అందించాలన్నారు. ఇళ్ల దగ్గర కంటే స్కూల్లోనే భోజనం రుచికరంగా ఉందన్న భావన విద్యార్థుల్లో కలగజేసే విధంగా అందించాలన్నారు. నిర్వాహకులు వంట సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, పాటించాల్సిన విధి, విధానాలు, పరిసరాలు శుభ్రతపై రిసోర్స్ పర్సన్ వివరించారు. ఈ సమావేశంలో నోడల్ ప్రధానోపాధ్యాయుడు వేమగిరి నూకరాజు, వేంపాడు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎమ్.మూర్తిరాజు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు పాల్గొన్నారు.

చిన్నారులకు క్రీడా పోటీలు

ప్రజాశక్తి - నక్కపల్లి:నక్కపల్లి శాఖ గ్రంధాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గ్రంధాలయ అధికారి గోవిందేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం చిన్నారులకు లెమన్ అండ్ స్పూన్ క్రీడ పోటీలను నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో ఈ పోటీల్లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దవసెంగి సన్యాసిరావు (బాబ్జి), కె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డిఎస్ఓ సేవలు అభినందనీయం

జిల్లా కలెక్టర్ విజయ సునీత

డిఎస్ఓ శ్యామ్‌కుమార్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ విజయసునీత

ప్రజాశక్తి-పాడేరు:జిల్లా పౌర సరఫరాల అధికారి శ్యామ్ కుమార్ సేవలు ఆదర్శవంతమని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత కొనియాడారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన డి ఎస్ఓ శ్యామ్ కుమార్ పదవీ విరమణ ఆత్మీయ సమావేశానికి ఆమె ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఉన్న ఆఫ్లైన్ సమస్యలను అధిగమించి సకాలంలో లబ్దిదారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసారని ప్రశంసించారు. మిగిలిన జిల్లాలతో సమానంగా పౌర సరఫరాల సేవలలో అగ్రగామిగా నిలిపారన్నారు. జిల్లాలలో తక్కువ కాలం పని చేసినా అధికారులకు, సిబ్బందికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. టైపిస్టుగా ఉద్యోగంలో చేరి జిల్లా పౌర సరఫరాల అధికారిగా ఎదిగి పలువురికి ఆదర్శంగా నిలిచిన సౌమ్యుడని పేర్కొన్నారు. జిల్లాలో నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించారని చెప్పారు. శ్యామ్ కుమార్ సేవలను యువత ఆదర్శంగా తీసుకుని జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

శ్యామ్ కుమార్ మాట్లాడుతూ, గత ఏడాది జూలై 5న జిల్లా పౌర సరఫరాల అధికారిగా బాధ్యతలు స్వీకరించానని, అందరి సహకారంతో విజయవంతంగా విధులు నిర్వహించానని చెప్పారు. విధుల్లో సంపూర్ణ సహకారం అందించిన అధికారులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలియ జేసారు. అనంతరం జిల్లా కలెక్టర్, డి.ఆర్ఓ శాలువా కప్పి సన్మానించారు. పలువురు అధికారులు, సిబ్బంది శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలియ జేసారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ బి.పద్మావతి, ఎస్‌డిసిపి. అంబేద్కర్, సివిల్ సప్లైస్ డిఎం. బి.గణేష్ కుమార్, పౌర సరఫరాల డిప్యూటీ తహశీల్దార్ ప్రశాంత్, డిపి ఆర్ ఓ పి.గోవిందరాజులు, ఎల్‌డిఎం. రవితేజ, తహశీల్దార్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

తులసి ఆశయ సాధనకు కృషి

తులసి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి -ములగాడ : అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) విశాఖ జిల్లా అధ్యక్షులు వై.తులసి ఆశయ సాధనకు కృషిచేయడమే ఆమెకిచ్చే నిజమైన నివాళి అని వక్తలు పేర్కొన్నారు. మల్కాపురం జోన్ పరిధి 40వ వార్డు ఎకెసి.కాలనీ అంగన్‌వాడీ భవనంలో మల్కాపురం ప్రాజెక్ట్ అంగన్వాడీవర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన శుక్రవారం తులసి సంస్మరణసభ నిర్వహించారు. అంగన్‌వాడీ కార్మికులు ఘనంగా నివాళులర్పించారు. తులసి చిత్రపటానికి సంఘం నాయకులు కె.ఈశ్వరమ్మ పూలమాలవేశారు. సిఐటియు మల్కాపురం జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తులసి 42 రోజుల పాటు అంగన్‌వాడీ కార్మికుల సమస్యలపై పోరాడారన్నారు. సమస్య పరిష్కారమయ్యే వరకు అందర్నీ ఐక్యంచేసి ముందుండి పోరాటాన్ని నడిపారని తెలిపారు. పట్టుదల, నిజాయితీగా యూనియన్‌ను నడిపే ఘనత ఆమెకే దక్కిందన్నారు. ఆమె హఠాన్మరణం యూనియన్‌కేకాదు విశాఖ కార్మిక ప్రజా ఉద్యమానికి తీరనిలోటు అన్నారు.

ఐద్వా రాష్ట్ర కమిటీ నాయకులు ఆర్.విమల నివాళులర్పిస్తూ తులసిలాంటి కార్యకర్తలు ఉండడంవల్ల అంగన్వాడీ కార్మికుల సమస్యలు పరిష్కరించుకోగలిగారని తెలిపారు. తులసి ఆశయాల సాధనలో నడిచినప్పుడే ఆమెకు మనమిచ్చే అసలైన నివాళి అని పేర్కొన్నారు. కె.ఈశ్వరమ్మ అధ్యక్షత వహించిన సంతాప సభలో సంఘ సభ్యులు భారతి, ఈశ్వరి, దాక్షాయిని, పైడికొండ, వై.ఇందిర పాల్గొన్నారు.

జీరో రోడ్డు ప్రమాదాలే లక్ష్యం

నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ నగరంలో జీరో రోడ్డు ప్రమాదాలు సాధించడమే లక్ష్యమని నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ తెలిపారు. రోడ్డు ప్రమాదాలు నివారించాలని ఉద్దేశంతో గాజువాకలో ట్రాఫిక్ స్విచ్ మేనేజ్‌మెంట్ అవుట్ పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా చాప్టర్ సహకారంతో 15 మంది వాలంటీర్లను నియమించామని తెలిపారు. వీరికి 45 రోజుల పాటు, ట్రైనింగ్ ఇచ్చి ద్విచక్ర వాహనాలను కూడా అందజేశామని చెప్పారు. శ్రీనగర్ నుంచి షీలా నగర్ వరకు జాతీయ రహదారిలో వాహనాలు నడుపుతున్న వేగం, రాంగ్ డ్రైవింగ్, రాంగ్ రూటు, సిగ్నల్ జంప్, నో పార్కింగ్ తదితరాలను వీరు పరిశీలిస్తారని తెలిపారు. గత కొన్ని నెలలుగా ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్న షీలా నగర్ నుంచి పాత గాజువాక వరకు ప్రమాదకరమైన జోనుగా పరిశీలించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర సంయుక్త పోలీస్ కమిషనర్ పకీరప్ప, డిసిపి మేకా సత్తిబాబు, ఏసిపిలు త్రినాథ్, వాసుదేవ్, ఎ.నరసింహమూర్తి, రాజీవ్‌కుమార్, ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, షణ్ముఖరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తింపు లేని పాఠశాలల వివరాలు వెల్లడించాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ జిల్లాలో గుర్తింపులేని అన్ని యాజమాన్యాల పాఠశాలల వివరాలలను ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభంకాక మునుపు బహిర్గతం చేయాలని అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులకు ఆదేశాలు జారీచేసినట్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదలచేశారు. గుర్తింపు లేని పాఠశాలల వివరాలు తెలుసుకోవడం బాలల హక్కు అని పేర్కొన్నారు. గుర్తింపు లేని పాఠశాలల వివరాలు ప్రసార, ప్రచార, పత్రికలు, ఇతర సోషల్ మీడియా ద్వారా అందరూ తెలుసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలు, ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా గుర్తింపు పొందేందుకు తాత్సారం చేసే ఆయా పాఠశాలలపై చట్ట ప్రకారం చర్యలతో పాటు క్రిమినల్ కేసులు పెట్టేందుకు వెనుకడుగు వేయొద్దని సూచించారు. ఇటువంటి పాఠశాలల్లో విద్యార్థులు చేరకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు వహించాలని సూచించారు.

అప్పారావును ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : వైద్య ఆరోగ్య శాఖలో సుదీర్ఘకాలం పాటు అంకితభావంతో ప్రజలకు సేవలందించిన పి.రామకోటి అప్పారావును సహచర ఉద్యోగులంతా ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి తులసి రాజ్ అన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో 26 ఏళ్ళ పాటు పనిచేసిన రామకోటి అప్పారావు ఉద్యోగ విరమణ సందర్భంగా ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నగేష్ పట్నాయక్ ఆధ్వర్యాన శుక్రవారం ఏర్పాటుచేసిన ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో తులసీరాజ్ మాట్లాడుతూ, వైద్య ఆరోగ్య శాఖలో వివిధ విభాగాలలో పనిచేసిన రామకోటి ఉన్నతాధికారుల మన్ననలతో పాటు, మంచి పేరు సంపాదించారన్నారు. చిన్న స్థాయి నుంచి సూపర్‌వైజర్ స్థాయి వరకు ఎదిగారని తెలిపారు. కరోనా మహమ్మారి కాలంలో ఆయన అందించిన సేవలు మరువలేనివన్నారు. ఆయన ఉన్నతి వెనుక ఉన్న ఆయన సతీమణి కోటి లక్ష్మి, ఆయన కుటుంబ సభ్యుల సహకారాన్ని అభినందించారు. పదవీవిరమణ అనంతరం తన శేషజీవితం ఆయురారోగ్యాలతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. అనంతరం రామకోటి అప్పారావు. లక్ష్మి దంపతులను సత్కరించి సన్మాన పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఇఒలు శ్రీనివాసాచారి, శేషుబాబు, నాగశ్రీను, వెంకటేష్, యూనియన్ నాయకులు రమణ, ఎస్వీ రమణ, సూపర్ వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

ప్రజాశక్తి- కోటవురట్ల: ఎకరాకు పది కిలోల చొప్పున 50శాతం రాయితీపై పచ్చి రొట్ట విత్తనాలు అందజేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారిని సరోజిని తెలిపారు. మండల వ్యాప్తంగా రైతుబరోసా కేంద్రాలలో జీలుగ, జనుము పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉంచామన్నారు. విలేకర్లతో ఆమె మాట్లాడుతూ, అధిక దిగుబడి కోసం రసాయనిక ఎరువులు మోతాదుకు మించి వాడటంతో దిగుబడి పెరగకపోగా పోషకాలు దెబ్బతిని భూమి నిస్సారమ వుతుందని తెలిపారు. రైతులు సేంద్రియ ఎరువులు వాడటం ఎంతైనా మంచిదన్నారు. ప్రధాన పంటకు సాగుకు ముందు జీలుగ, జనుము, పిల్లి పెసర వంటి పచ్చిరొట్ట ఎరువులు సాగు చేపట్టాలన్నారు. పచ్చిరొట్ట ఎరువులతో భూమిలో నీటిని, పోషకాలను నిలిపే సామర్థ్యం ఏర్పడుతుందన్నారు. ఆసక్తి గల రైతులు పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్ కార్డు తీసుకుని రైతు భరోసా కేంద్రాల వద్ద విత్తనాలు కొనుగోలు చేసుకోవాలన్నారు.

పలు గ్రామాల్లో కార్డన్ సెర్చ్

ప్రజాశక్తి -కోటవురట్ల:ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగా మండలంలో పోలీసుల శుక్రవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎలమంచిలి, పాయకరావుపేట, నర్సీపట్నం పోలీసులతో కలిసి స్థానిక ఎస్సై రమణయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్డన్ సెర్చ్‌లో 150 వాహనాలను పరిశీలించి 80వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రికార్డులు సక్రమంగా లేని 24 ద్విచక్ర వాహనాలను, ఒక ఆటోను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, ఈనెల 4న జరగనున్న ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రజలంతా సహకరించాలని కోరారు. అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎజ్రా శాస్త్రిని సన్మానిస్తున్న సహోద్యోగులు

ఎజ్రా శాస్త్రికి ఘన సన్మానం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని వారిని గూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తూ ఉద్యోగ విరమణ చేసిన ఎజ్రా శాస్త్రిని ఆ పాఠశాల ఉపాధ్యాయులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఎజ్రా శాస్త్రి ఏజెన్సీలో 40 ఏళ్ల పాటు ఉపాధ్యాయుడిగా విశేష సేవలు అందించారని, అనేకమంది విద్యార్థులను ఉన్నత స్థానాల్లో ఉంచేలా తీర్చిదిద్దారని పలువురు ఉపాధ్యాయులు కొనియాడారు. ఉపాధ్యాయ వృత్తిలో ఆయన మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో అనేక ఉత్తమ అవార్డులు, రివార్డులు అందుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది తక్షణ చర్యలు చేపట్టాలని స్థానిక ఎంపీడీవో లోకుల యాదగిరిశ్వరరావు ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. మలేరియా వ్యాప్తి చెందకుండా దోమల నిర్వహణకు ఎటువంటి చర్యలు చేపట్టినది ఏ గ్రామాల్లో దోమల మందు పిచికారి చేసినది ఆరా తీశారు. మండలంలో మలేరియా డెంగ్యూ తదితర వ్యాధులు పెరగకుండా దానికి అనుగుణంగా వైద్య సిబ్బంది చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాజవొమ్మంగి, లాగరాయి, జడ్డంగి పీహెచ్సీ వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మిడ్డేమీల్స్ కార్మికులకు కనీస వేతనాలివ్వాలి

ప్రజాశక్తి - సీలేరు : మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనం రూ.18వేలు అమలు చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి జి.సత్యనారాయణ డిమాండ్ చేశారు. జీకే వీధి మండల కేంద్రంలో శుక్రవారం మిడ్డేమీల్స్ కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ప్రతి స్కూల్‌కి వంట షెడ్లు నిర్మించాలని, కార్మికులకు ఇన్సూరెన్స్ అమలు చేయాలని కోరారు. పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలని, ప్రతి నెల మొదటి వారంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘ మండల అధ్యక్షులు కింతర్ల కుమారి, కార్యదర్శి సాగిన కుమారి, మండల నాయకులు గమ్మెల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బహుళ వైకల్య పిల్లల వివరాలను తెలియజేయాలి

ప్రజాశక్తి-కొయ్యూరు : బహుళ వైకల్యం గల పిల్లల వివరాలను స్థానిక అంగన్వాడి కార్యకర్తలు సంబంధిత ఐసిడిఎస్ సూపర్వైజర్లకు తెలియజేయాలని కొయ్యూరు ఐసిడిఎస్ సిడిపిఓ విజయకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, అంకవైకల్యం, బుద్ధిమాంద్యం, చెవిటి, అంధత్వం, ప్రసంగం, భాషావైకల్యం, కుష్టువ్యాధి, తక్కువదృష్టి, దృష్టిలోపం, బేధోవైకల్యం తదితర బహుళ వైకల్యం పిల్లలు ఏయే అంగన్వాడీ కేంద్రాల పరిధిలో ఎంతమంది ఉన్నారనే వివరాలను సైపర్ వైజర్లకు అందజేస్తే, వారు ఆన్లైన్లో నమోదు చేస్తారని పేర్కొన్నారు. దీనితో వారికి ప్రత్యేక బడ్జెట్, ప్రత్యేకసహాయం అందుతుందని సిడిపిఓ విజయకుమారి వెల్లడించారు.

ఒపిఎస్‌ను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సిపిఎస్, జిపిఎస్‌లను రద్దు చేసి ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని శుక్రవారం సాయంత్రం మహారాణిపేటలోగల పెన్షనర్ల అసోసియేషన్ భవనంలో జరిగిన విశాఖ, అనకాపల్లి, పాడేరు జిల్లాల పెన్షనర్ల సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించింది. సమావేశానికి ఐక్యవేదిక రాష్ట్ర చైర్మన్ కెఆర్.సూర్యనారాయణ ప్రధాన వక్తగా హాజరై మాట్లాడారు. 12వ పిఆర్‌సిని తక్షణమే అమలు చేయాలన్నారు.

కెజిహెచ్ బ్రాండ్ దెబ్బతింటోందా ?

సూపరింటెండెంట్‌పై ఆరోపణలు
ఎట్టకేలకు వైద్యాధికారులకు కలెక్టర్ క్లాస్
పరిస్థితులను చక్కదిద్దేందుకు ప్రయత్నాలు

విశాఖలోని కెజిహెచ్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

పేద, బడుగు, బలహీన ప్రజానీకం ఆరోగ్య ప్రదాయిని కెజిహెచ్ అనడంలో ఎటువంటి సందేహమూ లేదు. ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాల నుంచే కాకుండా ఒడిశా రాష్ట్రం నుంచీ వేల మంది రోగులు విచ్చేసి ఇక్కడ సాంత్వన పొందుతారంటే అతిశయోక్తి కాదు. అంతటి బ్రాండ్ ఇమేజ్ ఈ పెద్దాసుపత్రిది. అయితే ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి. సూపరింటెండెంట్‌పై వచ్చిన ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.. కెజిహెచ్ సూపరింటెండెంట్‌గా ఉన్న అశోక్ కుమార్ ఓ మహిళా వైద్యాధికారిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారన్న వార్తలు గుప్పుమన్నాయి. ఈ వ్యవహారం కేసులదాకా వెళ్లింది. ఈ క్రమంలో డాక్టర్ అశోక్‌కుమార్ దీర్ఘకాల సెలవుపై వెళ్లిపోయారు. గతంలోనూ ఇక్కడ వివాదాలున్నా ఈ స్థాయిలో పోలీస్ కేసుల దాకా వెళ్లిన దాఖలాలు అరుదు. తాజా పరిస్థితిపై ఓ అంచనాకు వచ్చిన జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున శుక్రవారం వైద్యాధికారులు, సిబ్బందికి క్లాస్ తీసుకున్నారు. పరిస్థితులను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. దారితప్పితే వేటు తప్పదంటూ వైద్యాధికారులను, సిబ్బందిని హెచ్చరించారు.

చాపకింద నీరులా వాతావరణం కలుషితమవుతోందా ?

కెజిహెచ్‌లోని కొంతమంది వైద్యాధికారుల తీరు, ఆధిపత్య ధోరణులూ ఆసుపత్రి ప్రతిష్టను దిగజారుస్తున్నాయి. తాజాగా వెలుగుచూసిన వ్యవహారం మాయని మచ్చనే తెచ్చిపెట్టింది. కెజిహెచ్ సూపరింటెండెంట్ అశోక్‌కుమార్ లైంగిక వేధింపులకు గురిచేశారని నర్సింగ్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న జె.విజయలక్ష్మి ఆరోపించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆ విషయం పోలీస్ కేసు దాకా వెళ్లడం, డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ (అడ్మినిస్ట్రేటివ్ స్టేట్ బాడీ) అధికారుల విచారణ చేపట్టడం చకచకా జరిగిపోవడం అందరికీ ఎరుకే. గతంలో ఎంతో మంచి వాతావరణం కలిగి ఉన్న కెజిహెచ్‌లో కొంతమంది తీరుతో చాపకింద నీరులా ఆ వాతావరణం కలుషితమవుతోందన్న విమర్శలూ వినిపిస్తున్నాయి.

ప్రజలకు విశ్వాసం పెంచేలా పరిస్థితులు అభివృద్ధి కావాలి

పెద్దాసుపత్రి కెజిహెచ్ బ్రాండ్ విలువను రక్షించాలి. ఆసుపత్రికి విచ్చేసే ప్రజలకు విశ్వాసం కలిగించేలాగ పరిస్థితులు ఇంకా అభివృద్ధి కావాల్సి ఉంది. కెజిహెచ్ సేవల్లో ఎంతగానో అభివృద్ధి చెందింది. ఇక్కడున్న స్పెషల్ డిపార్టుమెంట్‌లు, వైద్యులు, నర్సింగ్ స్టాఫ్ ఎక్కడా ఉండరు. రెండు వేల వరకూ బెడ్స్ ఇక్కడ ఉన్నాయి. బడుగు, బలహీన, పేద తరగతుల వారిని దూరం చేసే చర్యలకు ఎవ్వరూ పాల్పడకూడదు. పలానా ఆసుపత్రి, డాక్టర్ మంచివారయితేనే కదా ప్రజలు అక్కడకు వచ్చేది. ఇప్పుడు చోటుచేసుకుంటున్న పరిణామాలు వంటివి జరిగితే కొంతకాలం ప్రజలు ఆసుపత్రిని దూరం పెట్టే ప్రమాదం ఉంది.

కె.అర్జున్,
కెజిహెచ్ మాజీ సూపరింటెండెంట్

కెజిహెచ్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ శివానంద బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ శివానంద నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. ఆర్థోపెడిక్ విభాగ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్ శివానంద గతంలో కెజిహెచ్ సూపరింటెండెంట్‌గానూ పని చేశారు. ఉత్తర్వులు అందగానే శివానంద బాధ్యతలు స్వీకరించారు. సహచరులంతా ఆయనకు సాదరంగా స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలిచ్చి అభినందనలు తెలిపారు.

ఇబ్బందికర పరిస్థితులే అయినా అధిగమిస్తాను

'ఇబ్బందికర పరిస్థితుల మధ్యనే ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌గా విధుల్లో చేరాను. బాధ్యతగా సేవలు అందిస్తాను. ప్రస్తుతం కెజిహెచ్‌పై వస్తున్న ఆరోపణలు, వివాదాలు కొంచెం ఇబ్బంది కలిగించేవే. ఇలాంటి పరిస్థితులు రాకుండా నా వంతు కృషిచేస్తాను సవాళ్లన్నిటినీ అధిగమించి కెజిహెచ్ సేవలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్తాను' అని శివానంద తెలిపారు.

పాఠశాలలో దోమల మందు పిచికారీ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : రంపచోడవరం ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు రాజవొమ్మంగి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో పిహెచ్సి వైద్యాధికారి సుష్మ ఆధ్వర్యంలో స్థానిక గురుకుల జూనియర్ కాలేజీలో ఏసీఎం 5శాతం దోమల మందును లోపల బయట శుక్రవారం పిచికారీ చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సుష్మ మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలలో ఆవరణలో నీటి నిల్వలు లేకుండా చూడాలని, పరిసరాల పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు పాటించాలని, విద్యార్థులందరూ దోమ తెరలు వాడేలా సిబ్బంది చూడాలని సూచించారు. వసతి గృహాల్లో పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. మలేరియా, డెంగ్యూ వంటి జ్వరాలు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు గూర్చి అవగాహన కల్పించారు. విద్యార్థులకు జ్వరాలు వస్తే తక్షణం పీహెచ్సీకి తీసుకురావాలని సిబ్బందిని ఆదేశించారు.

మలేరియా సబ్ యూనిట్ అధికారి చీడిపల్లి ప్రసాద్ మాట్లాడుతూ రాజవొమ్మంగి పిహెచ్‌సి పరిధిలో 10 పాఠశాలల వసతి గృహాల్లో, జడ్డంగి పీహెచ్సీ పరిదిలో 5 పాఠశాలల వసతి గృహాల్లో దోమల మందు మందు పిచికారీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాలేజి ప్రిన్సిపల్, సిబ్బంది, వైద్య సిబ్బంది సోమరాజు, నానిబాబు, స్ప్రేయింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డేవిడ్

ఆరోగ్యశ్రీ సేవలపై సమీక్షా సమావేశం

ప్రజాశక్తి - రంపచోడవరం : రంపచోడవరం ఏరియా హాస్పిటల్‌లో అల్లూరి జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ టి.డేవిడ్ శుక్రవారం ఆరోగ్యశ్రీ కేసులు గురించి ఆరోగ్యమిత్రలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.లక్ష్మి ఆరోగ్య శ్రీ ద్వారా అందుతున్న సేవలను తెలియజేశారు. అనంతరం డాక్టర్ డేవిడ్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న వారికి అవగాహన కల్పించి, ప్రతి కేసును ఆరోగ్య శ్రీ కార్డులో పెట్టాలని సూచించారు. ప్రతి నెలా 9వ తేదీన జరిగే ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్‌కు చుట్టూ పక్కల గ్రామాల నుండి వచ్చే గర్భిణులకు అవగాహన కల్పించాలని, ఉచితంగా స్కానింగ్, రక్తపరీక్షలు చేసి వైద్యసేవలు అందించాలని కోరారు. ప్రతి కేసును, ముఖ్యంగా ఎముకల విభాగంలో కేసులను ఆరోగ్య శ్రీ కంపల్సరీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శ్రీ సిబ్బంది, హాస్పిటల్ వైద్యులు పాల్గొన్నారు.

నకిలీ సెల్ ఫోన్ల విక్రయం

ప్రజాశక్తి-మారేడుమిల్లి : నకిలీ సెల్ ఫోన్లు అమ్ముతున్న ముఠా మారేడుమిల్లిలో హల్‌చల్ చేస్తోంది. బాధితుడు తెలిపిన వివరాలు ప్రకారం... గుర్తు తెలియని ఓ మహిళ మారేడుమిల్లిలో ఓ షాపు దగ్గరకు వచ్చి తను జియో నెట్వర్క్‌లో పనిచేస్తున్నామని, మా సార్ ఇంకా డబ్బులు ఇవ్వలేదని, ఊరు వెళ్ళడానికి డబ్బులు లేవని చెప్పి, తన సెల్ ఫోన్ తీసుకొని కొంత సొమ్ము ఇవ్వమని నమ్మ పలికింది. దీంతో ఆమె మాటలు నమ్మిన షాపు యజమాని ఒప్పో కంపెనీకి చెందిన ఫోన్ తీసుకొని, కొంత సొమ్ము చేతికిచ్చి, మరికొంత సొమ్ము డిజిటల్ పేమెంట్ చేశారు. ఆ తర్వాత ఫోనును పరిశీలించగా ఒప్పో నకిలీ ఫోనని తేలింది. ఫోన్‌కు సంబంధించిన పత్రాలు పరిశీలించగా అవి కూడా నకిలీ పత్రాలు గుర్తించారు. ఈ మేరకు తను మోసపోయిన విషయాన్ని మీడియాకు తెలియజేశారు. ఇలాంటి ముఠాలు మీ దగ్గరికి వస్తే వాళ్ళ మాటలను నమ్మవద్దని ఎవరు కూడా గుర్తు తెలియని వారి దగ్గర ఎటువంటి వస్తువులు కొనరాదని, అనుమానం వస్తే వెంటనే పోలీస్ శాఖ వారికి తెలియజేయాలని బాధితులు తెలిపారు.

వడదెబ్బ తగలకుండా అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - సీలేరు : వడదెబ్బ కురుకాకుండా ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని స్థానిక పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ సౌమ్య సూచించారు. శుక్రవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వృద్ధులు, చిన్నారులు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం మూడు గంటల వరకు ఎండలో ఎవరూ తిరగొద్దని సూచించారు. కాటన్ మెత్తని వస్త్రాలు ధరించాలన్నారు. ఆల్కహాల్ సేవించడం వలన శరీరంలో నీటి శాతం తగ్గిపోయి వివిధ వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ఎక్కువ శాతం నీటిని గాని, మజ్జిగ ద్రవపదార్థాలు సేవించాలని, శీతల పానీయాలకు దూరంగా ఉండాలని సూచించారు.

శబరి మత్స్యకార యూనియన్ ఏర్పాటు

ప్రజాశక్తి-చింతూరు : మండలంలోని శబరి నదిపై వేటాడుతూ జీవనం సాగిస్తున్న జాలరులు నూతనంగా శబరి మత్స్యకార యూనియన్‌ను శుక్రవారం ఏర్పాటు చేశారు. యూనియన్ అధ్యక్షుడిగా యర్రం శ్రీను, కార్యదర్శిగా నూకరాజు, ఉపాధ్యక్షులుగా మరిడియ్య, కోశాధికారిగా గూడెం మహేష్, సహాయ కార్యదర్శిగా హరికృష్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.